AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH, TRUST, TREND
WWW.AKSHARATODAY.IN
15-11-2025 (Saturday) MAIN EDITION

## రాణాలో పేలుడు.. ఏడుగురు దుర్మరణం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** జమ్మూకశ్మీర్‌లో మరో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. శ్రీనగర్ సమీపంలో ఉన్న నౌగామ్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం అర్ధరాత్రి పేలుడు సంభవించింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 27 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో ఫోరెన్సిక్ సిబ్బందితోపాటు పోలీసులు ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ఇటీవల స్వాధీనం చేసుకున్న పేలుడు పదార్థాలను అధికారులు పరిశీలిస్తున్న క్రమంలో పేలుడు చోటు చేసుకుంది.

## హైకోర్టు వెబ్‌సైట్ హ్యాక్




**అక్షరటుడే, హైదరాబాద్ :** సైబర్ నేరగాళ్లు రెచ్చిపోతున్నారు. ప్రభుత్వ వెబ్‌సైట్‌లను హ్యాకింగ్ చేస్తున్నారు. కీలకమైన సమాచారాన్ని దొంగిలిస్తున్నారు. తాజాగా తెలంగాణ హైకోర్టు వెబ్‌సైట్‌ను దుండగులు హ్యాక్ చేశారు. హ్యాకర్లు హైకోర్టు వెబ్‌సైట్‌ను హ్యాక్ చేశారు. ఆర్డర్ కాపీలు డౌన్‌లోడ్ చేస్తుంటే ఆన్‌లైన్ బెట్టింగ్ సైట్ ఓపెన్ అయింది. పీడీఎఫ్ ఫైల్స్‌కు బదులు బీడీజీ స్లాట్ అనే బెట్టింగ్ సైట్ ఓపెన్ అయినట్లు సిబ్బంది గుర్తించారు. దీంతో ఈ ఘటనపై హైకోర్టు రిజిస్ట్రార్ పోలీసులను ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## టీటీడీకి ఎలక్ట్రిక్ బస్సు విరాళం



**అక్షరటుడే, తిరుమల :** పూణేకు చెందిన పినాకిల్ మొబిలిటి సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ రూ.74.24 లక్షల విలువైన ఎలక్ట్రిక్ బస్సును శనివారం టీటీడీకి అందించింది. ఈ మేరకు ఆ సంస్థ ప్రతినిధులు శ్రీవారి ఆలయం ఎదుట బస్సు తాళాలను డిప్యూటీ ఈవో లోకనాథంకు అందజేశారు. కార్యక్రమంలో ట్రాన్స్‌పోర్ట్ డీఐ వెంకటాద్రి నాయుడు పాల్గొన్నారు.

## రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు



**అక్షరటుడే, విశాఖ :** విశాఖపట్నంలో జరుగుతున్న సీఐఐ సదస్సులో ఇప్పటి వరకూ రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. విశాఖ-సీఐఐ భాగస్వామ్య సదస్సులో శ్రీసిటీలోని 5 యూనిట్లను ఆయన శనివారం వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.2,320 కోట్ల పెట్టుబడులతో వివిధ ఉత్పత్తుల ప్రాజెక్టులకు ఒప్పందం చేసుకున్నారు.

## బీబీసీపై దావా వేస్తా: ట్రంప్



**అక్షరటుడే, నేషనల్ డెస్క్ :** అమెరికాలోని క్యాపిటల్ హిల్‌పై దాడి సందర్భంగా తన ప్రసంగాన్ని తప్పుడు అర్థం వచ్చేలా మార్చిన బీబీసీపై డోనాల్డ్ ట్రంప్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ సంస్థపై 5 బిలియన్ డాలర్ల దావా వేస్తానని హెచ్చరించారు. ట్రంప్ పరువుకు భంగం కలిగించినందుకు పరిహారం చెల్లించాలని ఆయన న్యాయవాదులు ఇప్పటికే ఆ సంస్థకు లేఖ రాశారు.

## ఆర్ఆర్ఆర్ బాధితులకు పరిహారం జమ

**అక్షరటుడే, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రీజినల్ రింగ్ రోడ్డు నిర్మాణాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విషయం తెలిసిందే. ఈ రోడ్డు నిర్మాణంతో అభివృద్ధి పెరుగుతుందని ప్రభుత్వం చెబుతుంది. ఈ మేరకు ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి సంబంధించి కొన్ని ప్రాంతాల్లో భూసేకర ప్రక్రియ పూర్తయింది. ఆర్ఆర్ఆర్ నిర్మాణంతో చాలా మంది భూములు కోల్పోతున్నారు. దీంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే. అయితే భూములు కోల్పోతున్న పలువురికి పరిహారం జమ అయింది. భూముల్లో ఎలాంటి నిర్మాణాలు లేని నిర్వాసితులకు మొదట డబ్బులు జమ చేస్తున్నారు.

## నలుగురు వైద్యుల రిజిస్ట్రేషన్ రద్దు

**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** దేశవ్యాప్తంగా కలకలం రేపిన ఉగ్రవాద మాడ్యూల్ కేసులో నలుగురు వైద్యులపై నేషనల్ మెడికల్ కమిషన్ కఠిన చర్యలు తీసుకుంది. ఉగ్రవాద కార్యకలాపాల నిరోధక చట్టం కింద కేసులు నమోదైన నేపథ్యంలో, ఈ నలుగురు డాక్టర్ల మెడికల్ రిజిస్ట్రేషన్లను పూర్తిగా రద్దు చేసి, భారతదేశంలో వైద్య వృత్తి నిర్వహించకుండా నిషేధం విధించింది. ఎన్ఎంసీ ఆదేశాల మేరకు, ఆయా రాష్ట్రాల మెడికల్ కౌన్సిళ్లు వారి పేర్లను ఇండియన్, నేషనల్ మెడికల్ రిజిస్టర్ల నుంచి తక్షణమే తొలగించాయి. తాజా ఉత్తర్వుల్లో డాక్టర్ ముజఫర్ అహ్మద్, డాక్టర్ అదీల్ అహ్మద్ రథర్, డాక్టర్ ముజామిల్ షకీల్, డాక్టర్ షాహీన్ షాహిద్‌పై నిసేధం విధించింది.
ఈ నలుగురికి ఇటీవల ఢిల్లీలోని ఎర్రకోట సమీపంలో జరిగిన కారు పేలుడు ఘటనకు సంబంధం ఉన్నట్లు పేర్కొంది.

# రాహుల్.. ఫెయిల్యూర్..

బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘోర పరాజయం పాలైంది. 61 చోట్ల పోటీ చేస్తే ఆరుస్థానాల్లో మాత్రమే గెలుపొందింది. ఈ నేపథ్యంలో పార్టీ అగ్రనేత, భావి ప్రధానిగా చెప్పుకునే రాహుల్ గాంధీ నాయకత్వంపై సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ఆయన నేతృత్వంలోని కాంగ్రెస్ పార్టీ.. అనేక ఎన్నికల్లో ఓటమి మూటగట్టుకుంది. రాహుల్ గాంధీ పార్టీలో కీలకంగా మారిన తర్వాత గత రెండు దశాబ్దాల కాలంలో జరిగిన అనేక ఎన్నికల్లో ఘోరంగా విఫలమైంది. ఈ నేపథ్యంలోనే ఆయన నాయకత్వ పటిమ, వ్యవహార శైలిపై సందేహాలు కలుగుతున్నాయి.

–అక్షరటుడే, హైదరాబాద్ ప్రతినిధి



- కాంగ్రెస్ పార్టీ మరోసారి వైఫల్యం
- మెజార్టీ ఎన్నికల్లో పరాభవం
- సార్వత్రిక పోరులోనూ పరాజయం
- తాజాగా బీహార్‌లోనూ తప్పని ఓటమి
- రాహుల్ నాయకత్వంపై మరోసారి విమర్శలు..

గాంధీ కుటుంబ వారసుడిగా రాజకీయాల్లోకి అడుగిడిన రాహుల్ గాంధీ కాంగ్రెస్ పార్టీకి విజయాలు సాధించి పెట్టడంలో విఫలమయ్యారు. 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల సమయంలో రాహుల్ క్రియాశీల రాజకీయాల్లోకి వచ్చారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా ఆయన నేతృత్వంలో హస్తం పార్టీ విజయాలు సాధించలేదు సరికదా అనేక ఎన్నికల్లో ఓటమి పాలైంది. రెండు దశాబ్దాల కాలంలో పార్లమెంట్ తో పాటు అనేక రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎలక్షన్లలో కాంగ్రెస్ బాధ్యతలను రాహుల్ గాంధీ మోశారు. కానీ, పార్టీని విజయ తీరాలకు చేర్చడంలో ఆయన వైఫల్యం చెందారు. కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన గ్రాండ్ ఓల్డ్ పార్టీకి చుక్కెదురైంది. అలాగే, పలు రాష్ట్రాల్లోనూ అదే ఫలితం రావడంతో రాహుల్ పార్టీ పగ్గాలను వదులుకున్నారు. సుదీర్ఘ చరిత్ర కలిగిన పార్టీని ముందుకు నడిపించడంలో రాహుల్ పూర్తిగా విఫలమయ్యారు. వరుస ఓటములతో సతమతమవుతున్న కాంగ్రెస్ ను తిరిగి బలోపేతం చేయడంలో వైఫల్యం చెందారు. కాంగ్రెస్ లో తనకంటూ ప్రత్యేక కోటరీ ఏర్పాటు చేసుకున్న అతడు.. మిగతా సీనియర్లను, దశాబ్దాలుగా పార్టీకి సేవ చేస్తున్న వారిని పట్టించుకోలేదు. ఫలితంగా గులాం నబీ ఆజాద్ లాంటి నేతలు హస్తం పార్టీని వీడారు. రాహుల్ నాయకత్వ వైఫల్యాలతో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకు ప్రాభవం కోల్పోయింది. దేశంలోని అనేక ప్రాంతాల్లో ఉనికే లేకుండా పోయింది. చాలా రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలకు తోక పార్టీగా మారిపోయింది.

### సత్తా చాటని రాహుల్..

2014లో మోదీ శకం ప్రారంభమైన తర్వాత రాహుల్ ప్రభ మరింత మసక బారింది. మోదీషా ద్వయం ఎత్తుగడలతో అన్ని ఎన్నికల్లో చిత్తుకావడం కాంగ్రెస్ వంతైంది. 2014, 2019లలో జరిగిన సార్వత్రిక పోరులో బీజేపీ సొంతంగా మెజార్టీ స్థానాలు దక్కించుకుంది. అలాగే, అనేక రాష్ట్రాల్లో అధికారం చేజిక్కించుకుంది. అదే సమయంలో కాంగ్రెస్ పార్టీ కనీస పోటీ ఇవ్వలేక చేతులెత్తేసింది. 2019లో అయితే, కేవలం 40 సీట్లలో మాత్రమే గెలుపొందిన హస్తం పార్టీ కనీసం ప్రతిపక్ష హోదా కూడా సాధించలేక పోయింది. 2024 లో జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపొందేందుకు రాహుల్ అనేక ప్రయత్నాలు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. దశాబ్ద కాలం పాటు అధికారంలో కొనసాగిన ఎన్డీయేను గద్దె దింపడంలో ఆయన విఫలమయ్యారు. భారత్ జోడో యాత్ర పేరిట దేశమంతా తిరిగినా ఓటర్లు కరుణ చూపలేదు. మూడోసారి ఎన్డీయేకే అధికారం అప్పగించారు.

### పని చేయని 'ఓట్ చోరీ'..

బీజేపీని ఎదుర్కోవడంలో విఫలమైన రాహుల్ గాంధీ కొంత కాలంగా సంచలన ఆరోపణలతో పతాక శీర్షికల్లోకి ఎక్కుతున్నారు. బీజేపీ, ఎన్నికల సంఘం కలిసి ఓట్ల చోరీకి పాల్పడుతున్నాయని రాహుల్ గాంధీ పలుమార్లు ఆరోపించారు. మీడియా సమావేశాల్లో ఎన్నికల సంఘంపై నేరుగానే తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. అంతకు ముందు ఈవీఎంల ట్యాంపరింగ్ అంటూ ఆరోపణలు గుప్పించారు. అయితే ఆయన ఆరోపణల్లో పస లేకపోవడంతో జనం లైట్ తీసుకున్నారు.

## బీఆర్ఎస్‌పై కవిత తీవ్ర విమర్శలు



**అక్షరటుడే, మెదక్ :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత జనంబాటలో భాగంగా మెదక్ జిల్లాలో పర్యటిస్తున్నారు. ఇందులో భాగంగా శనివారం ఆమె హవేలి ఘన్‌పూర్‌లో పాడి రైతులతో మాట్లాడారు. అనంతరం మెదక్‌లో విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్, హరీశ్‌రావుపై ఆమె విమర్శలు చేశారు. హరీశ్ రావు కుటుంబం, ప్రైవేట్‌గా పాల వ్యాపారాలు చేసి పాల రైతులకు అన్యాయం చేసిందని ఆరోపించారు. మెదక్ నుంచి హరీశ్ రావు మంత్రిగా పనిచేసినా లాభం లేకుండా పోయిందన్నారు. ప్రతిపక్షం తన పాత్రను సమర్థవంతంగా పోషించి ఉంటే జూబ్లీ హిల్స్ ఎన్నికల ఫలితాలు భిన్నంగా ఉండేవి అని కవిత అభిప్రాయపడ్డారు. కాంగ్రెస్‌పై రాష్ట్ర వ్యాప్తంగా వ్యతిరేకత ఉందని కవిత పేర్కొన్నారు. అయినా కూడా జూబ్లీహిల్స్ అన్ని వేల ఓట్ల మెజార్టీతో ఎలా గెలిచిందని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రతిపక్షంలో సరిగ్గా పనిచేయకపోవడంతోనే కాంగ్రెస్ గెలిచిందన్నారు. వాళ్లు సోషల్ మీడియాలో మాత్రమే ఉద్యమాలు చేస్తున్నారని విమర్శించారు.

## గర్వంతో కాంగ్రెస్ గూండాయిజం

**కేటీఆర్ సంచలన వ్యాఖ్యలు**



**అక్షరటుడే, హైదరాబాద్ :** జూబ్లీహిల్స్‌లో గెలవడంతో కాంగ్రెస్ పార్టీ విజయగర్వంతో గూండాయిజానికి పాల్పడుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. తమ పార్టీ కార్యకర్తపై జరిగిన దాడిని ఆయన ఖండించారు. రహమత్‌నగర్‌లో బీఆర్ఎస్ కార్యకర్త రాకేశ్‌ను పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. ఫలితాలు వచ్చి 24 గంటలు దాటక ముందే కాంగ్రెస్ గూండాయిజం చేస్తోందన్నారు. తాము అనేక ఎన్నికల్లో గెలిచామని, ఎప్పుడు దాడులు చేయలేదన్నారు. విజయగర్వంతోనే కాంగ్రెస్ నాయకులు శుక్రవారం ఊరేగింపు నిర్వహించారని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటామన్నారు. దొంగ ఓట్లు, గూండాగిరి, డబ్బులు పంచి ఎన్నికల్లో గెలిచారని ఆరోపించారు. కాంగ్రెస్ విజయోత్సవ ఊరేగింపుతోనే ఎవరిది అహంకారమో తేలిపోయిందన్నారు. తమ కార్యకర్తల మీద దాడి చేసిన వారిని వదిలిపెట్టమని ఆయన పేర్కొన్నారు.

## కోల్‌కతా బరాబజార్‌లో భారీ అగ్నిప్రమాదం



**అక్షరటుడే, నేషనల్ డెస్క్:** కోల్‌కతా నగరంలోని అత్యంత రద్దీ ప్రాంతాల్లో ఒకటైన బరాబజార్‌లో శనివారం ఉదయం భారీ అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం 5 గంటల సమయంలో 17 ఎజ్రా స్ట్రీట్‌లో ఉన్న ఓ ఎలక్ట్రికల్ గూడ్స్ షాప్ రెండో అంతస్తులో ఆకస్మికంగా మంటలు చెలరేగాయి. క్షణాల్లోనే మంటలు భవనమంతా వ్యాపించి భారీ ప్రమాదానికి దారితీశాయి. దుకాణంలో పెద్ద మొత్తంలో ఎలక్ట్రికల్ వస్తువులు నిల్వ ఉండడంతో, అవి భారీ శబ్దాలతో పేలిపోయాయి. మంటల ధాటికి భవనం కుప్పకూలిపోయింది.

## తిప్పేసిన జడేజా.. సౌత్ ఆఫ్రికా 93/7




**అక్షరటుడే, స్పోర్ట్స్ డెస్క్:** సౌత్ ఆఫ్రికాతో జరుగుతున్న తొలి టెస్ట్‌లో భారత బౌలర్లు సత్తా చాటారు. మొదటి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకే ఆ జట్టును ఆలౌట్ చేశారు. అనంతరం భారత్ 189 పరుగులకు ఆలౌట్ అయింది. కేఎల్ రాహుల్ 39 పరుగులతో టాప్‌స్కోరర్‌గా నిలిచాడు. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో రెండో రోజు ఆట ముగిసే సమయానికి సౌత్ ఆఫ్రికా 93 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. భారత ఆల్‌రౌండర్ జాడేజా నాలుగు వికెట్లతో సత్తా చాటాడు. కులదీప్ యాదవ్ 2, అక్షర్ పటేల్ ఒక వికెట్ తీశారు.

## ఐబొమ్మ నిర్వాహకుడు అరెస్ట్..




**అక్షరటుడే, సినిమా డెస్క్:** తెలుగు చిత్ర పరిశ్రమకు తలనొప్పిగా మారిన పైరసీ వెబ్‌సైట్ 'ఐబొమ్మ' నిర్వాహకుడు ఇమ్మడి రవిని పోలీసులు అరెస్ట్ చేశారు. కూకట్‌పల్లి ప్రాంతంలోని ఒక అపార్ట్‌మెంట్‌లో సీసీఎస్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి అతడిని అదుపులోకి తీసుకున్నారు. నవంబర్ 14న ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చిన వెంటనే అతను పోలీసుల రాడార్‌లో చిక్కినట్లు తెలుస్తోంది. ఇమ్మడి రవి కరేబియన్ దీవులలో నివసిస్తూ అక్కడ నుంచి ఐబొమ్మ వెబ్‌సైట్‌ను నిర్వహిస్తున్నాడు. రవి అరెస్ట్ అనంతరం ఐబొమ్మ వెబ్‌సైట్ పరిస్థితిపై ప్రశ్నలు తలెత్తాయి. సైట్ పూర్తిగా నిలిచిపోయిందా లేదా తాత్కాలికంగా మూతపడిందా అన్న వివరాలు తదుపరి విచారణలో తేలుతుంది.

## కృతిసనన్ అతనితో ప్రేమలో పడిందా..



టాలీవుడ్‌లో పలు సినిమాల్లో నటించిన కృతి సనన్ చాలా మంది ఫ్యాన్స్‌ను సొంతం చేసుకుంది. అయితే ఈ అమ్మడు ఇటీవల విక్కీ కౌశల్, కాజోల్, ట్వింకిల్ ఖన్నా కలిసి టూ మచ్ టాక్ షోలో పాల్గొంది. ఈ సందర్భంగా తన జీవితంలోని అనేక ఆసక్తికర విషయాలను వెల్లడించింది. ముఖ్యంగా రిలేషన్‌షిప్ సెగ్మెంట్‌లో కృతి మాట్లాడాల్సి రావడంతో.. ఆమె తన వ్యక్తిగత జీవితం బయటపెడుతుందని చాలా మంది భావించారు. కానీ కృతి చాకచక్యంగా ఆ ప్రశ్నలను తప్పించుకుంది. అయినా విక్కీ కౌశల్ మాత్రం ఆమెను ఆటపట్టిస్తూ.. రూమర్డ్ బాయ్‌ఫ్రెండ్ కబీర్ బాహియా పేరును ప్రస్తావించాడు. దానికి కృతి నవ్వుతూ స్పందించినప్పటికీ, ఏ విషయాన్నీ స్పష్టంగా చెప్పలేదు. అదే ఇంటర్వ్యూలో తాను చాలా రొమాంటిక్‌గా ఉంటానని తెలియజేయడమే కాకుండా, ప్రేమకథలు వినడం ఇష్టమని కృతి తెలిపింది. ఆ మధ్య ప్రభాస్‌తో ప్రేమలో ఉందని కూడా కొన్ని పుకార్లు వచ్చాయి. కానీ అవన్నీ పుకార్లగానే మిగిలిపోయాయి.

– అక్షరటుడే, సినిమా డెస్క్